పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సజావుగా గ్రూప్-2 పరీక్షలు

ప్రజాశక్తి- అనంతపురం

గ్రూపు-2 పరీక్షలు అనంతపురంలో సజావుగా జరిగాయి. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో జరిగిన గ్రూప్-2 పరీక్షల్లో ఉదయం జరిగిన పరీక్షల్లో 88.61 శాతం మంది హాజరవగా, మధ్యాహ్నం పరీక్షకు 88.31 శాతం మంది హాజరయ్యారు. ఊగిసలాటల మధ్య సాగిన ఈ పరీక్షలకు కొంత మంది సకాలంలో చేరుకోలేకపోయారు. రెండు నిమిషాల ముందుగానే వచ్చినా పరీక్షా కేంద్రంలో అనుమతించలేదని గణేష్ అనే అభ్యర్థి వాపోయాడు. మొత్తంగా చూసినప్పుడు పరీక్షలు సజావుగా జరిగాయి. మొత్తం 7293 మంది అభ్యర్థులు ఇక్కడ పరీక్ష రాయల్సి ఉండగా 6461 మంది హాజరయ్యారు. 832 మంది గైర్హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 6441 మంది హాజరవగా 852 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నుంచి పరీక్షల ఏర్పాట్లు ,నిర్వహణను జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ పరిశీలించారు. పివికెకె కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టరు శివనారాయణ శర్మ, జిల్లా ఎస్పీ జగదీశ్‌కు ఎస్ఎస్‌బిఎన్‌లో పరిశీలించారు.

క్లాప్ ...అట్టర్ ప్లాప్

'ఫైనాన్స్' స్వాధీనంలో చెత్తసేకరణ వాహనాలు

ఆగిన ఇంటింటి చెత్తసేకరణ

హిందూపురంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ వాహనాలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అనే పేరుతో గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం ప్లాప్ కార్యక్రమంగా ముగిసింది. అనంతపురం జిల్లాలో ఈ కార్యక్రమం అమలు జరుగుతున్న ఐదు చోట్ల ఆగిపోయింది. గత కొన్ని రోజులుగా ఇంటింటి చెత్తసేకరణ జరగడం లేదు. దీంతో పాత పద్ధతుల్లోనే చెత్త సేకరణను ఆయా మున్సిపాలిటీలు చేపట్టాయి గత వైసిపి ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో ప్రత్యేకంగా మినీ వాహనాలు కొనుగోలు చేసి ఇంటింటికి చెత్తసేకరణను ప్రారంభించారు బయట ఎక్కడా చెత్త కనిపించకూడదన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా సాగింది. కాని ఇప్పుడు చెత్తసేకరణ వాహనాలకు ఫైనాన్స్ కంతులు చెల్లించలేదని ఆయా సంస్థలు తమ వాహనాలను తీసుకెళ్లాయి. దీంతో చెత్తసేకరణ ఆగిపోయింది.

జిల్లాలో ఐదు చోట్ల ఆగిన కార్యక్రమం

అనంతపురం జిల్లాలో క్లాప్ కార్యక్రమం కింద అనంతపురం నగర పాలక సంస్థ, గుంతకల్లు పురపాలక సంఘంలో ప్రారంభించారు. ఇక సత్యసాయి జిల్లాలో ధర్మవరం, కదిరి, హిందూపురంలో చేపట్టారు. అనంతపురం నగరంలో 66747 గృహాల నుంచి చెత్తను సేకరించేందుకుగానూ 60 వాహనాలను ఏర్పాటు చేశారు. ఇక గుంతకల్లు పురపాలక సంఘంలో 34898 గృహాలకుగానూ 30 వాహనాలు, సత్యసాయి జిల్లాలోని కదిరిలో 21108 గృహాలకుగానూ 15 వాహనాలు, హిందూపురంలో 32793 గృహాల నుంచి చెత్తను సేకరించేందుకు 25 వాహనాలు ఏర్పాటు చేశారు. ఇక ధర్మవరంలో 34814 గృహాల నుంచి చెత్తను సేకరించేందుకు 25 వాహనాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ వాహనాలను ఏర్పాటు చేసే సమయంలో దీనికి పురపాలక సంఘం నుంచిగాని, ప్రభుత్వం నుంచిగాని నిధులివ్వకుండా చెత్త సేకరణ వాహనాలను బ్యాంకులు, ప్రయివేటు ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పుగా తీసుకుని వాహనాలను కొనుగోలు చేశారు. ఈ వాహనాల నుంచి చెత్తసేకరించే వారు విధిగా ప్రతి ఇంటి నుంచి చెత్త పన్ను వసూలు చేసి ఫైనాన్స్ సంస్థకు కంతుల వారీగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రజల్లో చెత్త పన్నుల చెల్లింపుపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. అదే సమయంలో తాము అధికారంలోకి వస్తే చెత్త పన్నును రద్దు చేస్తామని ప్రతిపక్షంలో టిడిపి హామీనిచ్చింది. ఈమేరకు చెత్తపన్నుపై నిర్ణయం చేసింది. అదే సమయంలో ఇప్పటి వరకు కంతులు కట్టకుండా ఉన్న వాహనాలను ఆయా ఫైనాన్స్ సంస్థలకు అప్పగించాలని కూడా నిర్ణయించింది. దీంతో వాహనాలు లేకుండాపోయాయి. ఫలితంగా ఇంటింటి చెత్తసేకరణ పూర్తిగా ఆగిపోయింది.

ఉన్న సిబ్బందిపై తీవ్ర పని ఒత్తిడి

ఇంటింటి చెత్త సేకరణ ఆగిపోవడంతో పాత పద్ధతుల్లోనే పారిశుధ్య నిర్వహణ జరగాల్సి వస్తోంది. అసలే తగినంత మంది సిబ్బంది లేరు. దీంతో ఉన్న పారిశుధ్య కార్మికులపై పని భారం విపరీతంగా పడుతోంది. ఉదాహరణకు అనంతపురం నగర పాలక సంస్థలో పారిశుధ్యం, ఇంజనీరింగు కార్మికులందరూ కలిపి 1400 మంది వరకు అవసరమవుతారు. కాని పని చేస్తున్న సిబ్బంది మాత్రం 680 వరకే ఉన్నారు. సగంకంటే తక్కువగానున్న సిబ్బందితో అనంతపురం నగరం పారిశుధ్య నిర్వహణ ఇబ్బందికరంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు క్లాప్ ఎత్తిపోయి..మరోవైపు సిబ్బంది కొరత నెలకొన్న తరుణంలో పారిశుధ్య నిర్వహణ అన్ని పురపాలక సంఘాల్లో సమస్యగానే మారింది.

వైఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేత 'టీమ్ స్పిరిట్'

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని మోతుకపల్లి వద్ద జరుగుతున్న డాక్టర్ వైయస్సార్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా టీం స్పిరిట్ జట్టు నిలిచింది. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆర్థిక సహకారంతో జరిగిన ఈ టోర్నమెంట్ లో 20 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో టిప్పుకాన్ స్టార్ జట్టు, టీం స్పిరిట్ జట్టు తలపడగా టీం స్పిరిట్ జట్టు 24 పరుగుల తేడాతో విజయం సాధించినట్లు నిర్వాహకులు, వైసిపి నాయకులు షబ్బీర్, గుడ్డం దాదాపీర్, షాహిద్, థౌసిఫ్, ఇర్ఫాన్, నయాజ్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్ లో గెలుపొందిన జట్టుకు రూ. 30 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందజేశారు. అలాగే రన్నరప్ గా నిలిచిన టిప్పు కాన్ స్టార్ జట్టుకు రూ.20వేల నగదు, ట్రోఫీని వైసిపి నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మహేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి మణేసముద్రం గిరి, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకష్ణా రెడ్డి, నాయకులు సడ్లపల్లి శబరీష్ రెడ్డి, ఫారూక్, అయూబ్ బేగ్, కురుబ శ్రీనాథ్, షేక్ బాబాజాన్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

విజేతకు ట్రోఫీతో పాటు మెగా చెక్కును అందిస్తున్న వేణు రెడ్డి

రైతులకు అన్యాయం చేస్తే సహించం

లైనింగ్ పనులు దేనికి సంకేతం

విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు అన్యాయం చేయాలని ఎవరు చూసినా సహించే ప్రసక్తే లేదని, రైతుల సంక్షేమం కోసం ఎంతటి ఉద్యమాలకైనా తాము సిద్ధంగా ఉన్నామని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి తో కలిసి ఉషశ్రీ చరణ్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ లైనింగ్ పనులు వేగవంతంగా చేపడుతున్నారని ఈ పనులు దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాలువల ద్వారా నీళ్లను అందించాల్సిన సమయంలో పనులు చేయాల్సిన అవసరం ఏముందన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ లో 1.5 టీఎంసీ నీళ్లు ఉన్నాయనిఇందులో చట్టపరంగా కియా కు కేటాయించిన నీటిని వారికి వదలాల్సి ఉందని అన్నారు. దీంతోపాటు హిందూపురం పట్టణానికి తాగునీటికి సైతం ఇవ్వాల్సి ఉందన్నారు. మిగిలిన నీటిని ఎన్ని రోజులు కాలువల ద్వారా వదులుతారని ఎన్ని చెరువులను నింపుతారని అధికారులకు అడిగితే ఏ ఒక్కరు కూడా సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. తొలుత ఈ విషయాలను కూటమి పాలకులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. లైనింగ్ పనులు, కాలువల వద్ద ప్రొక్లైనర్లు, జెసిబిలను ఏర్పాటు చేసి, చేస్తున్న పనులను పరిశీలన చేస్తుంటే ఇక్కడి నుంచి కుప్పంకు నీటిని తీసుకెళ్లే విధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ హంద్రీనీవా కాలువల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులకు నీటిని అందించలేకపోయారన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో మడకశిర వరకు నీటిని తీసుకువెళ్లి అన్ని చెరువులను నింపిన ఘనత ఉందన్నారు. కొంతమంది టిడిపి నాయకులు ఆరు సంవత్సరాల తరువాత హంద్రీనీవా కాలవల ద్వారా నీటిని తీసుకొని వచ్చి చెరువులను నింపుతామని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరిని మభ్య పెట్టడానికి ఈ ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. కరోనా విపత్కర సమయంలో సైతం గొల్లపల్లి నుంచి మడకశిర నియోజకవర్గంలో ఉన్న చిట్ట చివరి చెరువు వరకు నీటిని తీసుకువెళ్లి నింపిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుగొండ నియోజకవర్గంలో ఉన్న అన్ని చెరువులకు నీళ్లు ఇవ్వని దుస్థితి ఉందన్నారు. హిందూపురం నాయకులు సామాజిక మాధ్యమాల్లో తొలుత మలుగూరు చెరువును కృష్ణా జలాలతో నింపుతామని ప్రచారం హోరెత్తించారన్నారు. ఈ ప్రచారంతోపాటు హిందూపురం నియోజకవర్గంలో ఎన్ని రోజులు నీళ్లను తీసుకొని వస్తారని ఎన్ని చెరువులను నింపుతారని చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను మోసం చేయడమే తప్ప వారిని ఆదుకోవాలన్న కనీస జ్ఞానం లేదని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇస్తామని చెప్పి నేటికి 20 రూపాయలు సైతం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని ధరల స్థిరికరణ ఏర్పాటు చేయలేదని అన్నారు. రైతులు పడుతున్న బాధలను నేరుగా తెలుసుకోవాలని పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి గుంటూరులో మిర్చి యార్డ్ కు వెళ్లి రైతులను కలిశారని ఆసమయంలో భద్రత కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. జగన్ బయటకు వస్తే కూటమి నాయకులు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. అందుకోసమే జగన్ పై అక్రమ కేసులు బనాయించడానికి సిద్ధమవుతున్నదన్నారన్నారు. తమ పార్టీ అధికారం మాత్రమే కోల్పోయిందని, జనాల్లో జగన్ పై ఉన్న అభిమానం కోల్పోలేదని అన్నారు. రైతులను రాజుగా చూసిన ఘనత వైసిపిది అని అలాంటి రైతులను అన్యాయం చేయాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు ఆసిఫ్ వుల్లా, కౌన్సిలర్లు శివ, షాజియా, మల్లికార్జున, వైసిపి నాయకులు నాగరాజు, రామకృష్ణారెడ్డి, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

కృత్రిమ అవయవాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వికలాంగులు కృత్రిమ కాలు కోసం మార్చి 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు కోరారు. 86390 81464, 91103 53497, అనంతపురంలోని వికలాంగుల ఆఫీస్ 08544-232380 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు చెప్పి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకున్న వారికి మార్చి 2వ వారంలో కొలతలు తీసుకుని 20 రోజుల తర్వాత రూ. 51 వేల విలువచేసే ఆధునిక, తక్కువ బరువు ఉన్న కృత్రిమ కాలు ఉచితంగా అమర్చుతారని తెలిపారు.

నాకు రూ. వంద కోట్లు ఉన్నాయి.. నాకే పని చెప్తారా?

ఎంపిడిఒకు పంచాయతీ కార్యదర్శి తలబిరుసు సమాధానం

ప్రజాశక్తి పుట్లూరు

'నాకు రూ.100 కోట్లు ఉన్నాయి. నాకే పని చెప్తారా అంటూ అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలోని ఒక పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవోను ప్రశ్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని పి-4 సర్వే నిర్వహించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో స్థానిక ఎంపిడిఒ పంచాయతీ కార్యదర్శుల దిశానిర్దేశం చేశారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. అయితే మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి పి- 4 సర్వే నిర్వహించలేదు. దీంతో ఎంపిడిఒ పంచాయతీ కార్యదర్శిని నాలుగురోజుల క్రితం ప్రశ్నించారు. అయితే ఆ పంచాయతీ కార్యదర్శి తలబిరుసు సమాధానమిచ్చారు. ' రూ. వంద కోట్లు ఉన్న నాకే పనిచెప్తారా'? నేను పనిచేయడానికి రాలేదు.. పనిచేయించడానికి వచ్చాను. మీరు చెప్పే పని చేయను'అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు. దీంతో ఎంపీడీవో ఖంగుతిన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హెచ్చరించగా అదే స్థాయిలో ఆ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా మాట్లాడాడు. ' మీరు కలెక్టర్‌కు చెబితే బిల్లులు మంజూరు చేయడం లేదని నేను కూడా ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దీంతో అక్కడే ఉన్న ఏవో, సీనియర్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిని మందలించారు. ' ఓ అధికారిని ఇలా మాట్లాడితే ఎలా' అని అంటే పంచాయతీ కార్యదర్శి వారిపై కూడా చిందులు వేశాడు.' ప్రతి ఒక్క అధికారి డబ్బులు తీసుకునే పని చేస్తున్నాడు' అంటూ వ్యాఖ్యానించాడు. 'నాకోసం ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే నేను లిఫ్ట్ చేయడం లేదు. ఇది నా రేంజ్' అని తలబిరుసుగా మాట్లాడాడు. 'నేను ఇక్కడ ప్రశాంతంగా ఉండడానికే బదిలీ చేయించుకున్నా.. పనిచేయడానికి కాదు.. నాకు పని చెప్పడానికి మీరెవరు' అంటూ ధిక్కారంగా మాట్లాడాడు. ఎంపిడిఒ కార్యాలయంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పంచాయతీ కార్యదర్శి వైఖరికి మండలంలోని పలువురు అధికారులు, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఉద్యోగి వల్ల మండలానికే చెడ్డపేరు వస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

జిల్లా అటవీశాఖ అధికారి టి.చక్రపాణి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అడవుల సంరక్షణ అందిరి బాధ్యత అనిజిల్లా అటవీ శాఖ అధికారి టి. చక్రపాణి స్పష్టం చేశారు. అడవులలోని వృక్షాల వల్ల స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం వస్తుంది. మేఘాలను ఆకర్షించి వర్షాలు కురవడానికి ఎంతో దోహదపడతాయి. ఎన్నో ఔషధాలు లభిస్తాయి. అడవులు లక్షలాది వన్యప్రాణులకు ఆవాసాలుగా ఉంటాయి. మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ అవసరం ఎంతైనా ఉంది. చివరకు చీపుర్లకు కావలసిన బోదగడ్డి కూడా అడవులలో లభ్యమవుతుంది. వంట చెరుకుతో పాటు పలు రకాల పండ్లు లభిస్తాయి. ఇన్ని ఉపయోగాలు ఉన్న అడవుల పరిరక్షణకు ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ మానవుని స్వార్థానికి ఏటా అడవులు నాశనం అవుతున్నాయి. అటవీ శాఖ అధికారుల కళ్ళుగప్పి ఇటుక బట్టీలకు, సామిల్లులకు టన్నుల కొద్ది కలప రవాణా చేస్తూనే ఉంటారు. కొంతమంది అధికారులు మామూళ్ళు తీసుకుంటూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక వేసవి వచ్చిందంటే చాలు అడవులకు ఏదో ఒకచోట నిప్పు పెడుతూనే ఉంటారు. కొందరు పశువుల కాపర్లు, గొర్రెలు, మేకలు పెంపకదారులు, మరి కొంతమంది ఆకతాయిలు సిగరెట్ లేదా బీడీ తాగుతూ దట్టమైన అడవులలో పారవేయడం ద్వారా నిప్పు రగులుతూ పచ్చని వనాలు అగ్నికి ఆహుతి అవడం మనం చూస్తూనే ఉంటాము. మరికొంతమంది అజ్ఞానులు వేసవిలో ఎండిన గడ్డికి నిప్పు పెడితే తిరిగి వర్షాకాలంలో బాగా గడ్డి వస్తుందని కూడా నిప్పు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ శాఖ అధికారి టి. చక్రపాణి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎంత? ఏయే ప్రాంతాల్లో అడువులు ఉన్నాయి.?

జవాబు : సత్య సాయి జిల్లాలో లక్ష 25 వేల హెక్టార్లలో అడవి విస్తరించి ఉంది. జిల్లాలో మూడు అటవీ క్షేత్రాలు ఉన్నాయి. (రేంజ్ లు) కదిరి, బుక్కపట్నం, పెనుకొండ అటవీ క్షేత్రాలు ఉన్నాయి. భూభాగం విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండాలి. అప్పుడే పర్యావరణం సమతుల్యంగా ఉంటుంది. అయితే దురదృష్టవశాత్తు జిల్లాలో 14 శాతం వెనుకబడి ఉన్నాము. వాటిని భర్తీ చేయడానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ప్ర: ఈ వేసవిలో అడవులకు నిప్పు పెట్టకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జ: అడవులకు అతి దగ్గరలో ఉన్న గ్రామాల ప్రజలకు నిప్పు పెట్టవద్దని కోరుతున్నాం. ఒకవేళ ఎవరైనా అజ్ఞానంతో నిప్పు పెడితే దానిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. గోడ పత్రికలు, కరపత్రాలు ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాం. అంతేగాక అడవులలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేశాం. వృక్షాలకు మధ్యన గుంత త్రవ్వడం వల్ల అగ్గి ముందుకు సాగకుండా ఈ ఫైర్ లైన్స్ ద్వారా అవకాశం ఉంది. ముఖ్యంగా గొర్రెలు, మేకలు, పశువుల కాపరులకు అగ్గిపెడితే జరిగే అనర్థాలు, నష్టం గురించి వివరిస్తున్నాం. అంతేగాక అడవులకు సమీపంలో గల రైతులు తమ పంట పొలాల్లో చెత్తను తొలగించే క్రమంలో అగ్గిపెడితే ఆ రైతులు అక్కడే ఉండి అగ్గి అడవిలోకి ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. అక్రమంగా కలపను తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : అటవీ శాఖ ద్వారా చేపడుతున్న ఇతర కార్యక్రమాలు ఏమిటి.?

జ: తమ శాఖ ద్వారా ఒక్కో అటవీ క్షేత్రంలో నగరవనాలు ఏర్పాటు చేస్తున్నాం. పుట్టపర్తి మండలంలోని అమగొండపాలెం, పెనుకొండ, చిలమత్తూరు మండలం చలివెందులలోని అటవీ క్షేత్రంలో ఈ నగరవనాలు ఏర్పాటు చేసాం. ఈ ఎకో పార్కుల వల్ల ప్రజలకు, పిల్లలకు విహారయాత్రలకు వచ్చే వారికి అహ్లాదపరిచే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో ఈ పార్కులను సందర్శించే ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది. వేసవిలో విశ్రాంతి కోసం ఎకో పార్కులను సందర్శించి సేద తీరవచ్చు.

ప్ర: సిబ్బంది కొరత ఉందా? మీ శాఖలో కొంతమంది సిబ్బంది అవినీతిపై ఏమంటారు.?

జ: సిబ్బంది కొరత ఉంది. దాదాపు 60 శాతం ఖాళీలు భర్తీ చేయవలసి ఉంది. వాటిపై ప్రభుత్వానికి నివేదించాం. ఈ వేసవిలో ఈ మూడు నెలల కోసం ప్రత్యేకంగా 15 మంది ఫైర్ వాచర్లను తీసుకోవడం జరిగింది. అలాగే మూడు అటవీ క్షేత్రాల్లో అటవీ సంరక్షణకై ప్రత్యేక టీములు ఏర్పాటు చేశాం. సిబ్బంది లో ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే తప్పనిసరిగా శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ: ప్రజల సహకారం భాగస్వామ్యం లేకుంటే ఏ వ్యవస్థ నిలబడదు. అడవులను సంరక్షించడం కేవలం అటవీ శాఖతోనే సాధ్యం కాదు. అడవులు యొక్క ప్రయోజనాలు గుర్తించి ప్రజలు కూడా భాగస్వామ్యం అవుతూ అడవులను రక్షించుకోవాల్సి ఉంది.ఎవరో ఆకతాయిలు పెట్టిన నిప్పు వల్ల అడవులలోని కొన్ని వేల వన్య ప్రాణులు మాడి మసవుతున్నాయి. దీంతో కొన్ని జంతువులకు ఆహార కొరత ఏర్పడి జనావాసాలపై పడుతుంటాయి. పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి అయితే జరిగే నష్టాన్ని ఎవరూ పూరించలేరు. అందుకే ఈ వేసవిలో అడవులు మన సంపద అని భావించి వాటిని కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత ప్రజలందరిపై ఉంది. భూభాగంలో 33 శాతం అడవులు ఉండాలి. మనం 14 శాతం వెనుకబడి ఉన్నాం. దానిని అధిగమించడానికి అందరూ సహకరించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు 50 శాతం పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. అందుకు తగ్గట్టుగా అన్ని వర్గాల ప్రజలు అధికారులు పచ్చదనం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

టి, చక్రపాణి

రైతుల సమస్యలపై నేడు ఆందోళనలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రైతుల సమస్యలు, ఎన్నికల సమయంలో రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీల అమలు కోసం సోమవారం సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఆలకుంట మారుతి, ఎస్‌హెచ్ బాషా ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అన్ని పంటలకు గిట్టుబాటు ధర, బీమా, హంద్రీనీవా కాలువ వెడల్పు, అన్ని చెరువులకు నీరు, గ్రీన్ ఎనర్జీ కారిడార్ పేరిట చేస్తున్న భూ సేకరణను నిలుపుదల చేయాలన్నారు. సాగుదారులకు పట్టాదారు పాస్ బుక్కులు ఇవ్వాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని సెజ్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని, పట్టు రైతుల ప్రోత్సాహక బకాయిలు విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు, నల్ల చట్టాల రద్దు, వ్యవసాయ మోటార్లకు ట్రాన్స్‌ఫార్మర్ ధర తగ్గింపు, విద్యుత్ అదనపు ఛార్జీలు రైతులపై పడకుండా చూడాలన్నారు. పగలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, పంట కాలువల మరమ్మతులు, పాలకు గిట్టుబాటు ధర, పశువులకు వైద్యసేవలు, పశుగ్రాసం, దాణాపై 50 శాతం సబ్సిడీ అందించాలన్నారు. ఆవులు, గేదెలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. చుక్కల భూములతో సహా రైతులు సాగులో ఉన్న బంజరు భూములన్నింటికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై సోమవారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామ సచివాలయాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు, సిఐటియు నాయకులు ఎల్.ఆది నారాయణ, హైదర్‌వలి, వెంకటస్వామి పాల్గొన్నారు.

పెనుకొండ : సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి కోరారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో రైతాంగ సమస్యలపై చేపట్టే నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. హరి మాట్లాడుతూ జిల్లాలో రోజు, రోజుకూ వ్యవసాయం భారంగా మారిందన్నారు. రైతులు అప్పుల ఊబిలో కురుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు కాటకాలు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రైతుల జీవితాలు నానాటికీ దుర్భరమవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో రైతులు మరింత ఇబ్బందులు పాలవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో గిట్టుబాటు ధరలు, సాగునీరు, మార్కెట్ సౌకర్యం, భూ సమస్యలు, సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, విద్యుత్, పాసు పుస్తకాల సమస్యలు పరిష్కరించాలని, రైతుల ఆత్మహత్యలు, వలసలను అరికట్టాలని ప్రభుత్వం, అధికారులను డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై ఈ నెల 24వ తేదీ గ్రామ సచివాలయాల వద్ద, మార్చి 3వ తేదీ తహశీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిఐటియు నాయకులు బాబావలి, తిప్పన్న, వెంకటరాముడు, ఊతప్ప పాల్గొన్నారు.

నల్లచెరువు : రైతుల సమస్యల పరిష్కారానికి పోరుడుతామని సిపిఎం నాయకులు తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివిఎల్.నరసింహుడు ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన రైతుల సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు, మండల కార్యదర్శి వెంకటస్వామి, మండల సభ్యులు శేఖర్, రజియా పాల్గొన్నారు.

పెనుకొండలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి

ధర్మవరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రకు సహకరించాలి : డిపిఒ

ప్రజాశక్తి-బుక్కపట్నం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రకు సహకరించా లని జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) సమత సూచించారు. మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామపంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలోల పరిసర ప్రాంతాల పరిశుభ్రత కోసం రెండు రోజుల పాటు చెత్త సేకరణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇందుకు గ్రీన్ అంబాసిడర్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టాలని తెలిపారు. చివరగా డిపిఒ క్లబ్ మిత్రలను సన్మానించారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న పారిశుధ్య పనులను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ కేశవరెడ్డి, ఈవోపిఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి, సర్పంచి రూపా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని కల్లుమర్రి గ్రామపంచాయతీలో సర్పంచి సి.గంగమ్మ నాగరాజు, ఈవోపీఆర్డీ ఎస్.నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ఆర్.వరదరాజులు సమక్షంలో రెండు రోజుల పాటు ప్రత్యేక స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి రోజూ ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ బండిలో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, అలాగే హానికరమైన చెత్తను పేపర్‌లో చుట్టి సైకిల్‌కు ఉన్న సంచిలో వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి : చెత్త సేకరణపై మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా చెత్తను రోడ్లపై కానీ, మురికి కాలువల్లో కానీ వేయరాదన్నారు. ప్రతి రోజూ మీ ఇంటి వద్దకే క్లాప్ మిత్ర కార్మికులు వస్తారని వారికి మీ ఇంట్లోని తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో ఇవ్వాలని ఎంపిడిఒ శ్రీధర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను క్లాప్ మిత్ర కార్మికులు చెత్త సంపద కేంద్రానికి తరలిస్తారని తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి, ఊటకూరు, బీచిగానిపల్లి గ్రామ పంచాయతీల్లో ఎంపిడిఒ పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి క్లాప్ మిత్ర కార్మికులు పాల్గొన్నారు.

బుక్కపట్నంలో క్లబ్ మిత్రను సన్మానిస్తున్న డిపిఒ సమత

పరిగిలో ఇంటింటికీ వెళ్లి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

లేపాక్షి ఆలయాన్ని యునెస్కో జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలి

చరిత్రకారుడు మైనాస్వామి వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తిరూరల్

లేపాక్షిలో ఉన్న వీరభద్రాలయ సముదాయానికి ఐక్యరాజ్యసమితి 'యునెస్కో' వారసత్వ కట్టడాల జాబితాలో శాశ్వతంగా చోటు సంపాదించడానికి ఓ నిపుణుల కమిటీని నియమించి నివేదికను తయారు చేయించాలని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్. మల్లికార్జునకు విజ్ఞప్తి చేసినట్టు చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. ఆయన శనివారం సాయంత్రం విజయవాడలో సంచాలకుడిని కలిసి నిపుణుల కమిటీ నియామక అంశంపై చర్చించినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లేపాక్షి వీరభద్రాలయ సముదాయాన్ని యునెస్కో వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చేర్చినట్టు 2023 మార్చి 30న యునెస్కో ప్రకటించింది. అయితే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందుకనుగుణంగా ఆలయంలోని నిర్మాణ విశేషాలు, అత్యున్నత శిల్ప సంపద, అత్యద్భుత తైలవర్ణ చిత్రాలు, ప్రపంచంలోనే పెద్దదైన రాతి నంది భారీ విగ్రహం వంటి విషయాలపై సమగ్ర అధ్యయనం చేసి నివేదికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని మైనాస్వామి తన లేఖలో కోరారు. ఆసియాలోకెల్లా అతి పెద్దదైన వీరభద్రస్వామి ఉగ్రరూప తైలవర్ణచిత్రం, నిలువెత్తు పద్మిని మహిళ సుందర శిల్పం, నేలను తాకని ఆకాశ స్తంభం, భిక్షాటనమూర్తి శివ అద్భుత శిల్పం, ఏడుపడగల నాగలింగం, సుందర నంది భారీ విగ్రహం లేపాక్షి ఖ్యాతిని పెంచుతున్నాయని లేఖలో వివరించారు. ఈ లేఖను రాష్ట్ర ప్రభుత్వానికి పంపి కమిటీ నియామకానికి చర్యలు చేపడతామని సంచాలకులు మల్లికార్జున తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న మైనాస్వామి

ఎక్సైజ్ సిఐ సృజనబాబును అభినందిస్తున్న ఎస్ఐలు

ఎక్సైజ్ సిఐ సృజనబాబుకు అభినందనలు

ప్రజాశక్తి-పెనుకొండ

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎక్సైజ్ సిఐ జి.సృజనబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఏపీపీ ఈఈఓఏ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సృజనబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు పెనుకొండ ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు, రేపు నీటి సరఫరాలో అంతరాయం

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో సోమ, మంగళవారాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మున్సిపాటిటీకి నీటి సరఫరాకు సంబంధించిన బత్తలపల్లి మండలం లోని తంబాపురం వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం జరగడం వల్ల విద్యుత్ లైన్లు కాలిపో యాయన్నారు. వాటి మరమ్మతులు చేసేందుకు రెండు రోజుల సమయం పడుతుందని, కావున పట్టణంలో రెండు రోజులు నీటి సరఫరా ఉండదన్నారు.

అబాకస్‌లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఈ నెల 2వ తేదీ ఈసిఎంఎఎస్ అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ డైరెక్ట్ అబాకస్ కాంపిటీషన్-2025లో పట్టణంలోని మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు సత్తా చాటారని సెంటర డైరెక్టర్ శ్రీవాణి, ఫ్రాంఛైజీ చంద్రశేఖర్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఆరేళ్ల జయానందన్, 8 ఏళ్ల మోక్షజ్ఞ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌ను సాధించారన్నారు. అలాగే పన్విత్, శౌర్య, నాగచరిత్, దివేష్, నిత్యశ్రీ, గ్రీష్మ, ఆదిత్యసాయి ఛాంపియన్ ట్రోఫీ, ధన్విన్‌కృష్ణ, దానిష్‌రాజ్, జయదీప్, కీర్తిప్రియ, పద్మజ్, హేత్విక, ఆరాధ్య, చైత్ర, హవీషశ్రీ విన్నర్ ట్రోఫీలు, లోహిత్, సజీవ్, మోనిత్, బ్రితిక, లోకేష్ టాపర్స్‌గా నిలిచారన్నారు. ఈ పోటీల్లో మొత్తం 10వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మిరాకిల్ ఎడ్యుకేషన్ సంస్థ ధర్మవరంలో 2007లో ప్రారంభించామని, ఇప్పటివరకు వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 15 సార్లు బెస్ట్ ఇన్‌స్ట్రక్చర్ అవార్డు పొందిందని తెలిపారు. అవుట్ స్టాండింగ్ పర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారన్నారు. అబాకస్‌లో విద్యార్థులను మరింత అభివృద్ధి దిశలో తీసుకెళ్తామన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు వన్‌టౌన్ ఎస్ఐ గోపికుమార్, సాంస్కృతిక మండలి అధ్యక్షులు సత్రశాల ప్రసన్నకుమార్, కోశాధికారి సోలిగాళ్ల వెంకటేశ్వర్లు చేత ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేసిన ఎస్ఐ గోపీకుమార్

ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక కోట వీధిలోని అతి పురాతన శివాలయంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ వారిచే జ్యోతిర్లింగ దర్శనాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని 25వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శన కార్యక్రమం, 26న కైలాస గిరి దర్శనం, 27న లక్ష దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ నిర్వాహకులు తెలిపారు.

పుట్టపర్తిలో కదలని చెత్త వాహనాలు..!

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు.. మరమ్మతులపై దృష్టి పెట్టని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో మున్సిపల్ కార్మికులు చెత్త సేకరించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నెల 15వ తేదీ జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి రెండు రోజుల్లో వాహనాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా మున్సిపల్ కమిషనర్ ఇంతవరకూ మరమ్మతులు చేయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2 కాంపాక్ట్ వెహికల్స్‌తో పాటు, 10 స్వచ్ఛభారత్ ఎలక్ట్రికల్ వాహనాలు కదలక మూలకు చేరాయి. వాటికి చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వస్తాయని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. కాంపాక్ట్ వెహికల్స్‌కు రూ. 2 లక్షలు వెచ్చిస్తే వినియోగంలోకి రానున్నాయి. స్వచ్ఛభారత్ ఎలక్ట్రికల్ వాహనాలకు ఇంజినాయిల్ మారిస్తే వాడుకలోకి రానున్నాయి. కానీ దీనికి బదులు 4 ట్రాక్టర్లను పెట్టి చెత్తను తరలిస్తున్నారు. ఈ ట్రాక్టర్లలో చెత్తను తరలించడానికి 8 మంది కార్మికులు అవసరమవుతారు. అదే కాంపాక్ట్ వెహికల్స్ వాడుకలోకి వస్తే ఇద్దరు కార్మికులతో చెత్తను తరలించవచ్చని పారిశుధ్య కార్మికులు పేర్కొంటున్నారు. కానీ వీటికి మరమ్మతులు చేయించకుండా కాలయాపన చేస్తుండడం దారుణమంటున్నారు. రెండు రోజుల్లో వాహనాల మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే ఆదేశించినా మున్సిపల్ కమిషనర్ పెడచెవిన పెట్టడం శోచనీయం. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి చెత్త వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని పారిశుధ్య కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ కాంపాక్ట్, స్వచ్ఛభారత్ వాహనాలు

రాష్ట్ర సరిహద్దులు దాటుతున్న కలప..

అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడదా..?

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొందరు వ్యాపారులు యథేచ్ఛగా కలపను అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కొందరు వ్యాపారులు కొత్తచెరువు కేంద్రంగా స్థానిక ధర్మవరం రోడ్డు మీదుగా పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల నుంచి కలపను అక్రమంగా లారీలు, ట్రాక్టర్ల ద్వారా కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలు గడిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు ధర్మవరం ప్రధాన రహదారి పక్కనే కలప మొద్దులను పెద్దమొత్తంలో నిల్వ చేసి అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా స్థానిక అటవీ, ఇతర శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కలప వ్యాపారుల నుంచి భారీగా ముడుపులు అందడం వల్లే అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అని ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు ప్రచారం చేస్తూ మొక్కల పెంపకం చేపడుతున్నారున. అయితే కొందరు అవినీతి అధికారులు వల్ల వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండా యథేచ్ఛగా చెట్లను నరికి కలపను రాష్ట్ర సరిహద్దులు దాటించి జేబులు నింపుకుంటున్నారు. కొత్తచెరువులోని కట్టెల మిషన్లకు కూడా పెద్దఎత్తున మొద్దులను తరలిస్తున్నారు. చెట్లను నరికి వేయడం వల్ల పర్యావరణానికి చాలా ప్రమాదం. ఇకనైనా ఉన్నతాధికారులు మేల్కొని గస్తీని పెంచి చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొత్తచెరువులో ధర్మవరం ప్రధాన రహదారి పక్కనే నిల్వ చేసిన కలప

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించాలని ఎస్పీ వి.రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆదివారం పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అందులో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులకు సూచనలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు చేపట్టారు. ఈవ్‌టీజింగ్, గ్యాంబ్లింగ్, మట్కా, పేకాట, మద్యం, చౌకబియ్యం, ఇసుక అక్రమ రవాణా, వంటి వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాలను సందర్శించి సైబర్ క్రైమ్, మహిళల పట్ల జరిగే నేరాలు, చైన్ స్నాచింగ్, తదిత అంశాలపై అవగాహన కల్పించారు. గోరంట్ల సిఐ శేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టి రికార్డులు లేని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నిబంధనలు విధిగా పాటించాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో ఆటో డ్రైవర్లు భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియమ నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ విజయకుమార్ సూచించారు. డీఎస్పీ ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. పోలీసుల నిబంధనల మేరకు ప్రతి ఆటో డ్రైవర్ తప్పకుండా నిబంధనలు పాటిస్తూ ఆటోలను నడుపుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్లవద్దన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహనం రికార్డ్స్ కలిగి ఉండాలని ఆదేశించారు. అలాగే ఫుట్‌పాత్‌పై ఎక్కడపడితే దుకాణాలు అక్కడ ఏర్పాటు చేయవద్దని, ఒక క్రమ పద్ధతిలో వాటిని ఏర్పాటు చేసుకొని ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పూల వ్యాపారులను ఆదేశించారు. ఎవరైనా రోడ్డుకు అడ్డంగా పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట సిఐ సునీత, ఎస్ఐ శ్రీరాములు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ విజయకుమార్

నేత్రదాత కుటుంబ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు ఈ నెల 10వ తేదీ గుండెపోటుతో మృతిచెందగా ఆయన నేత్రాలు దానం చేసేందుకు సహకరించిన కుటుంబ సభ్యులను ఆదివారం సన్మానించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్, ఆపిల్ ఐ కేర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జగన్‌మోహన్, రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ నరసింహులు, మోహన్‌కృష్ణ, ఆలంబన జనార్దన్, టెక్నీషియన్ జి.రాఘవేంద్ర, విశ్వదీప సేవా సంఘం ఫౌండర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నేత్రదాత పూజారి రామాంజనేయులు కుమారుడు పూజారి జగదీష్, కోడలు నటరాణి, వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. కార్యక్రమం లో సేవా సంఘం అధ్యక్షులు గాజుల సురేష్, సభ్యులు సుబ్రమణ్యం, జుజార్ రఘు, చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, మాధవ, వెంకటేష్, నారాయణస్వామి, ధనుంజయ పాల్గొన్నారు.

నేత్ర దాత కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

చౌడేపల్లిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని చౌడేపల్లి గ్రామంలో ఉన్న గీతా మందిరం వద్ద ఆదివారం ఏకలవ్య ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్టర్ హాస్పిటల్ డాక్టర్ కిరణ్ సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, పలు సలహాలు, సూచనలు చేశారు. కళ్లద్దాలు అందజేస్తామని తెలిపారు. శిబిరంలో సౌత్ భాగ్ ప్రభారీ శాంతి, సరస్వతి, రెడ్డమ్మ, రాజేశ్వరి, అలివేలు, ఆమని, కవిత, సుమలత, స్వర్ణ, రాధ, శశికళ, సున్నంపల్లి సర్పంచి దార లక్ష్మీదేవమ్మ, దార నాగేంద్ర, వట్టి ఆనంద, వై.వెంకటరంగారెడ్డి, ఎన్.హనుమంతురెడ్డి, వై.ఆదినారా యణరెడ్డి, సుబ్బరాయుడు, పి.జయచంద్రారెడ్డి, ఎస్.వెంకటరమణ, ఆనంద్ పాల్గొన్నారు.

చౌడేపల్లిలో కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ఆలయంలో భైరవస్వామి విగ్రహ ప్రతిష్టాపన పూజలు చేస్తున్న పూజారులు

భైరవస్వామి విగ్రహ ప్రతిష్టాపన పూజలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ శివారులోని రేగాటిపల్లి రహదారిలో వెలసిన ఆలయంలో ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్టాపన పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం భైరవస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉంటుందని, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని నిర్వాహకులు గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, మహేష్, ఆదినారాయణ, మల్లేష్, రవి, ఈశ్వరరావు కోరారు.

25న తిమ్మమ్మ మర్రిమాను వద్ద జాగరణ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను కదిరి నియోజకవర్గంలో నంబులపూల కుంట మండలంలోని ఈశ్వరమలై కొండల సమీపంలో గూటిబయలు గ్రామంలో ఉంది. కదిరి పట్టణానికి 15 కిలోమీటర్లు, శ్రీసత్యసాయిజిల్లా కేంద్రం పుట్టపర్తికి 80 కిలోమీటర్ల దూరంలో ఈ మహా వటవృక్షం ఉంది. దక్షిణ భారత దేశంలో అతిపెద్ద వృక్షంగా పేరు సంపాదించింది. ఈ మర్రి చెట్టు 7.44 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. ఈ చెట్టుకు తిమ్మమ్మ అనే మహిళకు గుర్తుగా ఈ పేరు పెట్టారు. 1989లో తిమ్మమ్మ మర్రిమాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం పొందింది.

చరిత్ర : బుక్కపట్నంకు చెందిన వెంకటప్ప, మంగమాంబ దంపతుల కుమార్తె తిమ్మమాంబకు గూటిబయలుకు చెందిన బాలవీ రయ్యతో వివాహం జరిపించారు. కొంతకాలం అనంతరం బాల వీరయ్య మృతిచెందగా తిమ్మమాంబ కూడా సతీసహగమనానికి సిద్ధమైంది. బరిలోకి దిగేందుకు ఎత్తు కోసం 4 మర్రి కర్రలు నాటారు. వాటిలో ఈశాన్య దిశలో నాటిన కర్ర చిగురించి మహా వృక్షంగా ఎదిగింది. ఆ మర్రి మాను ప్రపంచ పుటల్లో స్థానం పొందేందుకు 1989లో సత్యనారాణ అరియర్స్ కృషి చేశారు. తర్వాత గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. తాజా సర్వేలో 5559 ఊడలతో 8.5 ఎకరాల్లో విస్తరించి ఉందని తేలింది. మర్రిమానుకు దాదాపు 669 ఏళ్లు నిండాయి. మర్రిమాను కిందికి వెళ్తే ఏదో అరణ్యంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అడుగడుగునా ఓ ఊడ కనిపిస్తుంది. దేనికదే ఇదే చెట్టు మొదలేమో అనిపిస్తుంది. ఆకాశమంత హరిత పందిరి, భూమంతా ఆక్రమించిన వటవృక్షాన్ని చూసిన ఆశ్చర్యంలో గంటలు నిమిషాల్లా గడిచిపోతాయి.

తిమ్మమ్మ ఆలయం